www.sphoortipatrika.com APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth



విలేకరులు కావలెను

స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు

కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.

స్ఫూర్తి పత్రిక Voice of Truth

గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.

ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.

ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.




ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :18 | పేజీలు : 04 వెల రూ. 2/- | బుధవారం 18-03-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 18 | PAGES : 04 PRICE : 2 | WEDNESDAY, 18 MARCH 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |


## నాటో దేశాలకు ట్రంప్ వార్నింగ్




ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు

నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం

"అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు

## ఎక్కువ సీట్లు కావాల్సిందే.. డీఎంకేపై మిత్రపక్షాల ఒత్తిడి




సీట్ల సర్దుబాటు వ్యవహారం సంక్లిష్టంగా మారింది

ఇతర చిన్న పార్టీలు తమ డిమాండ్లను డీఎంకే నాయకత్వం ముందు ఉంచాయి

ఆ పార్టీల నేతలు వారాంతంలో అంతర్గత సమావేశాలు నిర్వహించి భవిష్యత్ వ్యూహంపై చర్చించారు

## భారత్ నౌకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్.. జైశంకర్ ఏమన్నారంటే?




- 'ఖచ్చితంగా, ఆయా దేశాలతో సమస్యలుంటే వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- భారత్ జెండాలతో జలసంధి గుండా వెళ్లొచ్చని సూచించింది
- ఇరాన్‌తో తాను జరిపిన చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ సంతోషం వ్యక్తం చేశారు

## పార్టీ మారుతున్నట్టు ప్రచారం... మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందన

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో వార్తల్లో నిలిచే మల్లారెడ్డి మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి మల్లారెడ్డి నేడు అసెంబ్లీ వద్ద క్లారిటీ ఇచ్చారు. "నా వయసు ప్రస్తుతం 73 ఏళ్లు. ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నాకు బాగా తెలుసు. మునిగిపోయే పడవలో ఎవరైనా ఎక్కుతారా? కాంగ్రెస్ పార్టీ ఒక మునిగిపోయే నావ లాంటిది. సీఎం రేవంత్ రెడ్డి 11 ఏళ్లు కాదు, 50 ఏళ్లు సీఎంగా ఉంటామన్నా ఆ పార్టీ మునిగిపోయే పడవే" అంటూ ఆ పార్టీలో చేరికను కొట్టిపారేశారు. ఇటీవల తన పెళ్లి రోజు వేడుకలకు ఆహ్వానించేందుకే రేవంత్ రెడ్డిని కలిశానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆమె ప్రధాని మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను ప్రశంసించడంతో పాటు, హైదరాబాద్ పేరును




'భాగ్యనగర్'గా మార్చాలన్న బీజేపీ డిమాండ్‌ను సమర్థించారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కుటుంబం కాంగ్రెస్ వైపు కాకుండా బీజేపీ వైపు చూస్తోందా? అనే కొత్త చర్చ మొదలైంది. గతంలో ఆమె బీజేపీ అగ్రనేత బండి సంజయ్‌ను కలవడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

### వరుస కథనాలు... స్పందన శూన్యం!

## ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు?

### ఆటోల్లో సప్లై... అధికారులు ఎక్కడ?




## "ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణ"

హైదరాబాద్: తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని గవర్నర్ గారు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. బడ్జెట్ సమావేశాలకు హాజరైన

## ఎల్‌పీజీ సంక్షోభంపై కేంద్రం అబద్ధాలు చెబుతోంది

- ఎల్‌పీజీ సంక్షోభంపై రాజ్యసభలో రచ్చ
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ధ్వజం
- ఖర్గేపై ఎదురుదాడికి దిగిన జేపీ నడ్డా




## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### -: కేంద్ర ప్రభుత్వం ప్రకటన




### రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా..

## అసెంబ్లీలో నిలదీస్తామన్న కేటీఆర్




ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసింది

రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు

### వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియదు.. మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలు అత్యంత దుర్మార్గం

ద్రోహం, ఎవరికీ సాయం చేయకూడదనేది జగన్ డీఎన్ఏలోనే ఉంది

గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం సుమారు రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసింది

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

## 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

- అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు
- ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది"
- ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు




అమరావతి: అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్ని ఛ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు.




ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని దూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను.

## మరుసటి రోజే గ్యారెంటీ డెలివరీ.. తపాలా శాఖ నుంచి సరికొత్త సర్వీస్




- భారత తపాలా శాఖ (ఇండియా పోస్ట్) కీలక ముందడుగు
- '24 స్పీడ్ పోస్ట్' పేరుతో సరికొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది
- ఈ '24 స్పీడ్ పోస్ట్' సేవలు దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలైన అందుబాటులోకి రానున్నాయి

ఢిల్లీ: పార్శిళ్లు, ఇతర వస్తువుల డెలివరీలో వేగాన్ని పెంచేందుకు భారత తపాలా శాఖ (ఇండియా పోస్ట్) కీలక ముందడుగు వేసింది. '24 స్పీడ్ పోస్ట్' పేరుతో సరికొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసును మంగళవారం (మార్చి 17) ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దీని ద్వారా అత్యవసరమైన పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే

### పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్



అమరావతి : అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ వేడుక తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. ఈ విగ్రహాన్ని సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... "శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను" అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నాటో దేశాలకు ట్రంప్ వార్నింగ్

ఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి "చాలా దారుణంగా" ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. "అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే" అని ఆయన హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. చమురు సరఫరాను అడ్డుకుంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, దానిని అడ్డుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడబోమని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలతో నాటో కూటమిలో ఒక్కసారిగా కలకలం రేగింది. పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా పాల్గొనడానికి యూరోపియన్ దేశాలు మొగ్గు చూపకపోవడంతో, అమెరికా, దాని మిత్రదేశాల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ మొదలైంది.

## ఎక్కువ సీట్లు కావాల్సిందే.. డీఎంకేపై మిత్రపక్షాల ఒత్తిడి

న్యూఢిల్లీ: తమిళనాడులో అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ లో సీట్ల సర్దుబాటు వ్యవహారం సంక్లిష్టంగా మారింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, తమకు కేటాయించే సీట్ల సంఖ్యను పెంచాలని పలు మిత్రపక్షాలు గట్టిగా పట్టుబడుతుండటంతో చర్చలు కఠిన దశకు చేరుకున్నాయి. గతంలో కంటే కూటమి విస్తరించడం, క్షేత్రస్థాయిలో తమకు బలం పెరిగిందన్న కారణాలతో వామపక్షాలు, ఇతర చిన్న పార్టీలు తమ డిమాండ్లను డీఎంకే నాయకత్వం ముందు ఉంచాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో చెరో ఆరు స్థానాల్లో పోటీ చేసి రెండేసి సీట్లు గెలుచుకున్న సీపీఐ, సీపీఎం పార్టీలకు ఈసారి చెరో ఐదు సీట్లు ఇస్తామని డీఎంకే ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై వామపక్ష నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కనీసం గతంలో పోటీ చేసినన్ని సీట్లయినా కేటాయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఆ పార్టీల నేతలు వారాంతంలో అంతర్గత సమావేశాలు నిర్వహించి భవిష్యత్ వ్యూహంపై చర్చించారు. మరో మిత్రపక్షమైన తమిళగ వాల్వురిమై కట్చి (టీవీకే) సైతం సీట్ల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తమకు మళ్లీ ఒక్క సీటే కేటాయిస్తే డీఎంకేతో పొత్తును పునఃపరిశీలించుకోవాల్సి వస్తుందని ఆ పార్టీ అధినేత టి. వేల్‌మురుగన్ స్పష్టం చేశారు. "అదనపు సీట్లు కావాలని డిమాండ్ చేసినా డీఎంకే నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ పరిస్థితుల్లో ఒక్క సీటు కోసం కూటమిలో కొనసాగడంపై మా పార్టీ ఉన్నతస్థాయి కమిటీ పునరాలోచిస్తోంది," అని ఆయన విలేకరులతో అన్నారు. దీంతో పాటు పది డిమాండ్ల జాబితాను కూడా డీఎంకేకు సమర్పించామని ఆయన తెలిపారు. ఈ పరిణామాలపై తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై స్పందిస్తూ.. కూటమిలో కాంగ్రెస్ పార్టీ చేసిన సర్దుబాట్లను మిత్రపక్షాలు గుర్తించాలని సూచించారు. ఒకప్పుడు 100కు పైగా స్థానాల్లో పోటీ చేసిన తాము, కూటమి కోసం క్రమంగా సీట్ల సంఖ్యను తగ్గించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే, మరో మిత్రపక్షమైన విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) నేత థోల్ తిరుమావళవన్ మాత్రం డీఎంకేతో చర్చలు సాఫీగా సాగుతున్నాయని చెప్పడం గమనార్హం. 2021లో ఆరు సీట్లలో పోటీ చేసి నాలుగు గెలిచిన వీసీకేకు ఈసారి ఒకటి లేదా రెండు అదనపు స్థానాలు లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మిత్రపక్షాలతో చర్చలను ముమ్మరం చేసి, అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను ఖరారు చేయడం ద్వారా కూటమిని ఐక్యంగా ఉంచేందుకు డీఎంకే నాయకత్వం ప్రయత్నిస్తోంది.

## భారత్ నౌకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్.. జైశంకర్ ఏమన్నారంటే?

న్యూఢిల్లీ: హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు కొనసాగుతున్న వేళ ఇరాన్‌తో తాను జరిపిన చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం నేను ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నాను. ఈ చర్చలు ఫలితాల్ని ఇస్తున్నాయి. ఇరాన్‌తో భారత్ నిరంతరం టచ్‌లోనే ఉంటుంది. చర్చల ద్వారా దౌత్యపరమైన విజయాలు లభిస్తుంటే వాటిని పరిశీలించడంలో తప్పులేదు. నేనుకూడా అదే చేస్తున్నాను' అని ఫైనాన్షియల్ టైమ్స్ ఇంటర్వ్యూలో జైశంకర్ తెలిపారు. 'ఖచ్చితంగా, ఆయా దేశాలతో సమస్యలుంటే వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. భారత్ దృక్కోణం నుండి ఇరాన్‌తో చర్చలు జరపడం,సమన్వయం చేసుకోవడం మంచిది. పరిష్కారం సైతం లభిస్తోందన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంత కొనసాగుతోంది. క్రమంలో ప్రపంచ దేశాలపై ఆర్థిక పరమైన ఒత్తిడి తెచ్చేలా ఇరాన్ తన హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు విధించింది. తమని కాదని చమురు నౌకల రవాణాని కొనసాగిస్తే వాటిని పేల్చుతామని హెచ్చరించింది. అందుకు కొనసాగింపు ఇరాన్ హర్మూజ్ జలసంధిలో నేవల్ మైన్స్‌ను నింపేసింది. 700నౌకలను నిలిపివేసింది ఈ క్రమంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇరాన్‌తో చర్చలు జరిపారు. హర్మూజ్ జలసంధిలో భారత్ నౌకలపై ఆంక్షలు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో హర్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు భారత్ గ్యాస్, చమురు నౌకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ ప్రకటించింది. భారత్ జెండాలతో జలసంధి గుండా వెళ్లొచ్చని సూచించింది.

ఆరోణల్ని ఖండించిన జైశంకర్

భారత జెండాతో ఉన్న నౌకలకు సంబంధించి ఇరాన్‌తో ఎలాంటి 'సమగ్ర ఒప్పందం'లేదని విదేశాంగ మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా భారత్ నౌకలకు అనుమతి ఇవ్వడం ద్వారా ఇరాన్ ప్రతిఫలం పొందిందనే ఆరోపణలను ఆయన ఖండించారు. ఇలాంటి ఆరోపణలు రావడం దురదృష్టకరం. భారత్-ఇరాన్‌ల మధ్య చిరకాల సంబంధం ఉంది. దాని ఆధారంగా చర్చలు జరిపినట్లు పునరుద్ఘాటించారు. భారత్ నౌకలకు అనుమతి ఇవ్వడం శుభపరిణామం. అయినప్పటికీ హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు రావాల్సిన నౌకలు చాలా ఉన్నాయి. వాటి విషయంలో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు.

## రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా.. అసెంబ్లీలో నిలదీస్తామన్న కేటీఆర్

హైదరాబాద్: ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పించన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

## వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియదు.. మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం

అమరావతి,: అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలు అత్యంత దుర్మార్గమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. కేవలం దోపిడీలు, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలు, దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాల విలువ ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. సోమవారం అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలనపై, ఆయన వ్యక్తిత్వంపై నిమ్మల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..' ద్రోహం, ఎవరికీ సాయం చేయకూడదనేది జగన్ డీఎన్ఏలోనే ఉంది. సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేసిన చరిత్ర ఆయనది. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం సుమారు రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసి, ఏపీ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారు. రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి అడ్డగోలుగా అప్పులు చేశారు. ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో జగన్ సమాధానం చెప్పాలి. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేస్తే.. జగన్ అధికారం కోసం ఆస్తులను, వ్యవస్థను దోచుకున్నారు. త్యాగధనుల విగ్రహాలపై విమర్శలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ప్రజల సొమ్మును రక్షిస్తాం' అని అన్నారు.

## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు -: కేంద్ర ప్రభుత్వం ప్రకటన

ఢిల్లీ: వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నేడు సాయంత్రం 5 గంటలకు ఈ క్యారియర్ భారత్ చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

మొదటి పేజి తరువాయి


# వరుస కథనాలు... స్పందన శూన్యం!

# ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు?

- వరుస కథనాలు వెలువడినా మార్పు కనిపించదు
- గ్రామాల్లో బహిరంగంగా ద కొనసాగుతున్నాయన్న ఆరోపణలు
- ఇప్పటివరకు అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై ప్రశ్నలు
- పై అధికారులు జోక్యం అవసరమంటున్న ప్రజలు

**దేవనకొండ, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండలంలో బెల్ట్ మద్యం విక్రయాలపై వరుసగా కథనాలు వెలువడుతున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.తాజాగా రాత్రివేళల్లో వాహనాల ద్వారా మద్యం గ్రామాలకు తరలిస్తున్నట్లు దృశ్యాలు బయటకు రావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. చిన్న బంకులు, దుకాణాల వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.ఇప్పటికే ఈ అంశంపై వరుస కథనాలు వెలువడినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించకపోవడం గమనించాల్సిన అంశంగా మారింది. ముఖ్యంగా సంబంధిత శాఖల నుంచి ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన స్పందన రాకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.గ్రామాల్లో ఈ విధంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణల మధ్య, ఈ దందా ఎవరి సంరక్షణలో నడుస్తోందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ వ్యవస్థ సక్రమంగా పని చేస్తుందా? లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఎక్సైజ్ శాఖ పాత్రపై కూడా ప్రజల్లో చర్చ జరుగుతోంది. వరుసగా వార్తలు వెలువడు తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడం, పర్యవేక్షణలో లోపాలు న్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా కార్యకలాపాలు కొనసాగడం వల్ల యువతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు మరింత కట్టుదిట్టంగా పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు .ఇప్పటికైనా పైస్థాయి అధికారులు స్పందించి కిందిస్థాయి సిబ్బంది పనితీరుపై సమీక్ష జరిపి పరిస్థితిని సరిచేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బెల్ట్ మద్యం... ఎవరి సంరక్షణలో?




# "ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణ"

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అంచెలంచెలుగా వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరించింది. వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం, పౌర సేవలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పునర్వవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. దీనికి తోడుగా కోర్ అర్బన్ రీజియన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వవస్థీకరించాం. అలాగే కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులు, ట్యాంకులను పునరుద్ధరించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించింది. హైడ్రా ఏర్పాటు ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుంది. ఆధునాతన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో 55 కి.మీ. మేరకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న ప్రాంతంలో (పెరి-అర్బన్ రీజియన్) మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎకో-ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్ కంపెనీలతో మౌలిక సదుపాయాల హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఎగుమతుల్లో దేశంలోనే 7వ స్థానంలో తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా రేడియల్ రోడ్లు, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణె నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లతో రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుంది.

# యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి



ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు.

యువగళం హామీని నిలబెట్టుకున్నా

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. "ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, 'వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం' అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను 'భారతదేశ మెర్కాటర్'గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎల్‌పీజీ సంక్షోభంపై కేంద్రం అబద్ధాలు చెబుతోంది

న్యూఢిల్లీ: ఇరాన్ వార్‌తో దేశంలో ఎల్‌పీజీ గ్యాస్ లభ్యంత గందరగోళంగా మారింది. సోమవారం పార్లమెంటులో ఈ సంక్షోభంపై దుమారం రేగింది. ఒకవైపు ఎల్‌పీజీ కొరతలేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఆందోళనగా కరంగా ఉందని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. దీంతో ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపి) మల్లికార్జున్ ఖర్గే, జె.పి. నడ్డా మధ్య వాగ్వాదంచోటు చేసుకుంది. జీరో అవర్ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, గల్ఫ్ యుద్ధం మరియు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎల్‌పిజి సరఫరాపై ఆందోళనలు చెలరేగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ కేంద్రంపై మండిపడింది. రాజ్యసభలో ఎల్‌పిజి సంక్షోభ అంశాన్ని లేవనెత్తిన మల్లికార్జున్ ఖర్గే సిలిండర్ల ప్యానిక్ బుకింగ్‌పై ఖర్గే విమర్శలు గుప్పించారు. ఎల్‌పిజి సమస్య మధ్యతరగతి, రెస్టారెంట్లు, హాస్టళ్లు , వాణిజ్య వినియోగ దారులను ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో, ఎల్‌పిజి లభ్యత, ధర స్థిరత్వం తీవ్రమైన సమస్యలుగా మారాయనే విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. కేంద్ర పెట్రోలియం మంత్రి ఎల్‌పిజి కొరత లేదని లోక్‌సభలో ప్రకటించిన వైనాన్నిఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్న వాదనలు తప్పు అని వాస్తవాలు రుజువు చేస్తున్నామని మండిపడ్డారు.హార్ముజ్ జలసంధి దిగ్బంధనంతో తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రభుత్వం సరిగ్గా నిర్వహించలేదని ఖర్గే ఆరోపించడంతో జీరో అవర్ సమయంలో ఘర్షణ చెలరేగింది. దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సిలిండర్ల



తీవ్ర కొరతకు ప్రభుత్వమే కారణమని ఖర్గే అన్నారు. మధ్యతరగతి , పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. రెస్టారెంట్లు, హాస్టళ్లు కమ్యూనిటీ కిచెన్‌లను మూసివేయాల్సి వచ్చిందని, ఎల్‌పిజి సిలిండర్లను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన పేర్కొన్నారు. దేశంలో 60 శాతం ఎల్‌పిజి దిగుమతి అవుతుందని, ఇందులో 90 శాతం సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుంద న్నారు. ప్రపంచ చమురు సంక్షోభానికి దారితీసే కీలకమైన సముద్ర మార్గం ఇది అని అన్నారు. ఎల్‌పిజి సరఫరాపై కేంద్రం ముందస్తు ప్రణాళిక వేసుకుని ఉంటే, ఈపరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఖర్గే ఎరువుల సరఫరా కొరతను కూడా ఎత్తిచూపారు. అలాగే సిలిండర్ కోసం వెయిటింగ్ సమయాన్ని కూడా 21 - 25 రోజులకు పెంచారు, ఇది, బ్లాక్ మార్కెటింగ్‌కు దారితీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రభుత్వ పేలవమైన ప్రణాళిక నిదర్శనమని, ఇది విదేశాంగ విధానంపై కూడా ప్రశ్నలను లేవనెత్తుతుదని ఖర్గే మండిపడ్డారు. ప్రణాళిక లేకపోవడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి దేశంలో ఎల్‌పిజి సరఫరాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు.

నడ్డా కౌంటర్

ఖర్గే విమర్శలతో సభలో వేడి రాజుకుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, నడ్డా కూడా స్పందించారు. జీరో అవర్ కారణంగా సభ్యులు ప్రజా సమస్యలపై లేవనెత్తాల్సిన అవసరం ఉందని, చైర్ జోక్యం చేసుకోవాలని నడ్డా కోరారు. సభలో తీవ్రమైన అంశాలపై చర్చలు జరుగుతున్నపుడు వాటిపై శ్రద్ధపెట్టకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు న్రా+ సమస్యపై మాట్లాడకుండా ఇతర అంశాలపై మాట్లాడటానికే మొగ్గు చూపారంటూ రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు.

ప్రతిపక్షాల ఆందోళన

అయితే ప్రతిపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, న్రా+ సంక్షోభం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడిని కొనసాగించాయి. ప్రతిపక్షాల వైపు నుంచి గందరగోళం కొనసాగుతుండగానే, సభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ముగించాలని ఖర్గేను కోరారు. ఖర్గే చేసిన ఆరోపణలకు బదులిస్తూ, నడ్డా ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు అసలు ఈ సంక్షోభం దేశం వల్ల కాదని, ప్రపంచవ్యాప్త కారణాల వల్లే తలెత్తిందని పేర్కొన్నారు. కాగా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులు మరియు వంట గ్యాస్ నిరంతరాయంగా లభ్యతను నిర్ధారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# మరుసటి రోజే గ్యారెంటీ డెలివరీ.. తపాలా శాఖ నుంచి సరికొత్త సర్వీస్




దీని ద్వారా అత్యవసరమైన పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే గ్యారెంటీగా డెలివరీ అందించనుంది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొంటారు. తొలి దశలో ఈ '24 స్పీడ్ పోస్ట్' సేవలు దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్‌లలో అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలతో పాటు, మరుసటి రోజు డెలివరీ అందించే '24 స్పీడ్ పోస్ట్', రెండు రోజుల్లో డెలివరీ అందించే '48 స్పీడ్ పోస్ట్' సేవలను కూడా ప్రవేశపెడుతున్నారు. వీటికి ప్రత్యేక ప్రాసెసింగ్ విండోలు, విమానాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఈ కొత్త సేవల్లో ఓటీపీ ఆధారిత సురక్షిత డెలివరీ, ఎస్ఎంఎస్ అలర్ట్‌లతో కూడిన ఎండ్-టు-ఎండ్ ట్రాకింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. వ్యాపార వినియోగదారుల కోసం 'బై నౌ పే లేటర్' సదుపాయం, బల్క్ బుకింగ్స్‌పై ఉచిత పికప్, ఏపీఐ ఇంటిగ్రేషన్ వంటివి కూడా అందిస్తున్నట్లు కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒకవేళ డెలివరీలో ఆలస్యం జరిగితే 'మనీ బ్యాక్ గ్యారెంటీ' కూడా ఇస్తామని, ఇది ఇండియా పోస్ట్ ప్రీమియం సేవలను మరింత బలోపేతం చేస్తుందని వివరించింది. దేశవ్యాప్తంగా పార్శిల్, ఈ-కామర్స్ రంగంలో సేవలను విస్తరించి, ఓ ప్రధాన లాజిస్టిక్స్ సంస్థగా మారేందుకు తపాలా శాఖ అనేక చర్యలు చేపడుతోందని ఈ నెల మొదట్లో మంత్రి పెమ్మసాని లోక్‌సభలో వెల్లడించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇప్పుడు ఈ నూతన సేవలను అందుబాటులోకి తెస్తున్నారు.

# కురుకుందలో నీటి సమస్యపై ఎమ్మెల్యే విరుపాక్షి జోక్యం... కలెక్టర్‌కు వినతి

- చాలా రోజులుగా కొనసాగుతున్న తాగునీటి ఇబ్బందులు
- హెబ్బటం నుంచి పైపులైన్ ప్రతిపాదన, ?59 లక్షల నిధుల
- సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్



**హోళగుంద, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** ఆలూరు నియోజకవర్గ పరిధిలోని కురుకుంద గ్రామంలో తాగునీటి సమస్య చాలా కాలంగా కొనసాగుతూ గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రోజువారీ అవసరాలకు సరిపడా నీరు అందక ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్న పరిస్థితి నెలకొంది.గ్రామంలో తాగునీటి కొరత కారణంగా మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే విరుపాక్షి, గ్రామంలోని తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కురుకుంద గ్రామానికి శాశ్వత పరిష్కారం కోసం హోళగుంద మండల పరిధిలోని హెబ్బటం గ్రామం నుంచి పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.ఈ పైపులైన్ ఏర్పాటుకు సుమారు ?59 లక్షల నిధులు మంజూరు చేయాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కురుకుంద గ్రామ ప్రజలు కూడా ఈ అంశంపై త్వరితగతిన పరిష్కారం లభించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై అధికారుల దృష్టి పడటంతో త్వరలోనే ఉపశమనం లభిస్తుందని గ్రామస్తులు భావిస్తున్నారు.

# క్యాన్సర్‌కు కవచం... బాలికలకు హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యం

- దేవనకొండ పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ కార్యక్రమం
- 14--15 ఏళ్ల బాలికలకు ఉచిత టీకా అందజేత
- తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి
- క్యాన్సర్ నివారణకు కీలక అడుగు: వైద్యులు

**దేవనకొండ, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):**దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమంలో సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆయన బాలికల ఆరోగ్య రక్షణకు ఈ టీకా ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలలో భాగంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ఉచితంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకా ప్రధానంగా 14 సంవత్సరాలు పూర్తయి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.బాలికలకు టీకా ఇవ్వడానికి ముందు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమ్మతి తప్పనిసరిగా తీసుకుంటామని తెలిపారు. అలాగే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న బాలికలకు పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే టీకా ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.టీకా తీసుకున్న అనంతరం కనీసం 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రంలోనే ఉండాలని సూచించారు. టీకా వేసిన ప్రదేశంలో నొప్పి, వాపు, ఎర్రదనం, స్వల్ప జ్వరం, తలనొప్పి, అలసట వంటి తేలికపాటి దుష్ప్రభావాలు కనిపించే అవకాశ ముందని, ఇవి సాధారణంగా ఒకటి లేదా రెండు రోజుల్లో తగ్గిపోతాయని తెలిపారు.భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గించడంలో ఈ టీకా కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు పేర్కొన్నారు. బాలికల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు విజయభాస్కర్, కళ్యాణ్, సామాజిక ఆరోగ్య అధికారులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, వైద్య సిబ్బంది, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.







## పండుగల దృష్ట్యా మాంసం విక్రయాలపై కట్టుదిట్టమైన

# నిఘా అవసరం... నిర్లక్ష్యం ప్రమాదకరం

- ఉగాది, రంజాన్ వేళ వినియోగం పెరుగుతుండగా పరిశుభ్రతపై సందేహాలు
- మురికి ప్రదేశాల్లో విక్రయాలపై ప్రజల్లో ఆందోళన
- పశువైద్యుల తనిఖీలు, నిబంధనల అమలు కీలకం
- తక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

**దేవనకొండ, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** ఉగాది, రంజాన్ పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో దేవనకొండ మండలంలో మేక, పొట్టేలు మాంసం విక్రయాలపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పండుగల సమయంలో మాంసం వినియోగం అధికమవుతుండటంతో నాణ్యత, పరిశుభ్రత అంశాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి .మండలంలోని కొన్ని ప్రాంతాల్లో మురికి కాలువల పక్కనే తాత్కాలిక బంకులు ఏర్పాటు చేసి మాంసం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. పరిశుభ్రతకు విరుద్ధంగా ఉన్న ఇలాంటి పరిస్థితులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మాంసం విక్రయానికి ముందు జంతువులకు పశువైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి అయినప్పటికీ ప్రతి చోట ఈ ప్రక్రియ కచ్చితంగా అమలు అవుతోందా అన్న ప్రశ్నలు





వినిపిస్తున్నాయి. ఆరోగ్యపరమైన ధృవీకరణ లేకుండా మాంసం విక్రయాలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.అలాగే మాంసం నిల్వ, కట్ చేసే పద్ధతులు, ఉపయోగించే పరికరాలు పరిశుభ్రంగా లేకపోతే వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మాంసాన్ని నేలపై లేదా అపరిశుభ్ర ప్రదేశాల్లో ఉంచడం, శుభ్రత పాటించకపోవడం వంటి అంశాలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని సూచిస్తున్నారు.కొన్ని సందర్భాల్లో అనారోగ్యంతో ఉన్న జంతువుల మాంసం లేదా నాణ్యత లేని మాంసం విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే మేక మాంసం పేరుతో ఇతర మాంసం విక్రయాలపై కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశాలపై స్పష్టత కోసం సంబంధిత శాఖలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.పశువైద్య శాఖ, పంచాయతీ విభాగం, ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి సమన్వయంతో మాంసం విక్రయ కేంద్రాలపై తనిఖీలు చేపట్టి నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.పండుగల సమయంలో ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవడం సంబంధిత శాఖల బాధ్యతగా ఉందని పేర్కొంటూ, ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మాంసం విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇఫ్తార్ విందులో ఇచ్చిన హామీని గంటల వ్యవధిలోనే నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నిన్న విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రకటించిన విధంగా వారి గౌరవ వేతనం బకాయిల కోసం రూ.45 కోట్లను ప్రభుత్వం ఇవాళ విడుదల చేసింది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే నిధులు విడుదల కావడం విశేషం. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 10,000 మంది ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి గత ఆరు నెలల బకాయిలను నేరుగా జమ చేయనున్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్‌లకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా విడుదల చేసిన రూ.45 కోట్లు.. 2025 అక్టోబరు నుంచి 2026 మార్చి వరకు ఆరు నెలల కాలానికి సంబంధించినవి. రాష్ట్రంలోని 5,000 మసీదులలో సేవలందిస్తున్న వారికి ఈ బకాయిలను ఒకేసారి క్లియర్ చేశారు. తమ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఇఫ్తార్ విందులో మాట్లాడిన సీఎం, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. అమరావతిలో కొత్తగా హజ్ హౌస్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. అలాగే, కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 21 నెలల్లో ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం కింద రూ.180 కోట్లు అందించామని వివరించారు.రాష్ట్రంలో అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించడంతో పాటు వివాహ లైసెన్స్ గడువును 3 సంవత్సరాల నుంచి 10 ఏళ్లకు పెంచామని చంద్రబాబు తెలిపారు. సుమారు 1,500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేసి వాటిని కాపాడుతున్నామని చెప్పారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎండల తీవ్రత... గడ్డివాముల వద్ద అప్రమత్తత అవసరం

- అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి
- కరెంటు వైర్లు, పొడి వాతావరణంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ సర్వీసులకు సమాచారం ఇవ్వాలి




**హోళగుంద, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** వేసవి కాలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రైతులు గడ్డివాముల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఎస్సై దిలీప్ కుమార్ గురజాల సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డివాముల వద్ద కరెంటు వైర్లు ఉండకుండా చూసుకోవాలని, ఎలక్ట్రికల్ వైర్ల రాపిడి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డివాము ఒక్కసారిగా మంటలకు ఆహుతి అయితే రైతులకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.గడ్డివాములను తగిన కవర్లతో కప్పి ఉంచడం ద్వారా వేడి ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే గడ్డివాముల చుట్టుపక్కల పొడి చెత్త, దహనానికి దారితీసే పదార్థాలు ఉండకుండా శుభ్రంగా ఉంచాలని సూచించారు.ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే ఫైర్ సర్వీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 101 టోల్ ఫ్రీ నంబర్ లేదా ఫైర్ కంట్రోల్ నంబర్ 9100108101 కు సమాచారం అందించాలని తెలిపారు.రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని, అప్రమత్తతే రక్షణకు మార్గమని ఎస్సై పేర్కొన్నారు.

# పండుగ వేళ గ్యాస్ సంక్షోభం... వినియోగదారుల ఆవేదన

- రంజాన్ సీజన్‌లో సిలిండర్ల కొరత తీవ్రం
- బుకింగ్ చేసి రోజులు గడిచినా డెలివరీ లేదు
- అధికారుల నిర్లక్ష్యంపై వినియోగదారుల అసంతృప్తి



**హోళగుంద, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** పవిత్ర రంజాన్ పండుగ సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో హోళగుంద మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రరూపం దాల్చింది. వంటలకు అత్యవసరమైన గ్యాస్ సకాలంలో అందకపోవడంతో సామాన్య వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్యాస్ బుక్ చేసిన వినియోగదారులకు రోజులు గడిచినా సిలిండర్లు డెలివరీ కాకపోవడం వల్ల ఆందోళన నెలకొంది. కొంతమంది వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు పలుమార్లు వెళ్లినా సరైన స్పందన లేకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు.పండుగల సమయంలో డిమాండ్ పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. గ్యాస్ కోసం వేచి చూసే పరిస్థితి రావడం వినియోగదారులపై అదనపు భారంగా మారింది.ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బడబాగ్నిలో బతుకు'బండ'లు!

భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించిన అయిదు సంవత్సరాలకు రెండు ఆధునిక ఉపకరణాలు భారతీయ గృహజీవనంలోకి ప్రవేశించాయి. అవి, ఒకటి ప్రెషర్ కుక్కర్, మరొకటి ఎల్పీజీ సిలిండర్. వీటి మూలాలు విదేశాలలో ఉన్నప్పటికీ, ఆధునిక భారతీయ కుటుంబంలో ఒక అనివార్యమైన భాగంగా, ఒక ఆకాంక్షాత్మక జీవన శైలికి ఆలంబనగా ఉన్నాయి. వంటగదిలో ఒకటి లేదా రెండు ప్రెషర్ కుక్కర్‌లు, ఎల్పీజీ సిలిండర్లు ఉండడమనేది నేటి భారతీయ కుటుంబ ప్రతిష్ఠ, శ్రేయస్సు, సామాజిక ఆకాంక్షలకు ఒక తార్కాణం. గత శతాబ్ది సినిమాలలో హీరో లేదా హీరోయిన్ కుటుంబ పేదరికాన్ని సూచించేందుకు కట్టెల పొయ్యిపై వంట చేస్తూ, చుట్టుముట్టిన పొగతో ఊపిరాడక సతమతమవుతున్న ఒక మహిళను చూపించడం సర్వసాధారణంగా ఉండేది.ఎల్పీజీ సిలిండర్‌కు ఉన్న రాజకీయ ప్రాధాన్యమూ తక్కువేమీ కాదు. గ్రామీణ ప్రాంతాల పేద కుటుంబాలకు పరిశుభ్రమైన వంట ఇంధనాన్ని సమకూర్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై-- దీనిని 2016లో ప్రవేశపెట్టారు) ఆ రాజకీయ ప్రాధాన్యానికి అద్దం పడుతుంది. ప్రధానమంత్రి నుంచి అమితానందంతో, ఎనలేని కృతజ్ఞతా భావంతో ఎల్పీజీ సిలిండర్లు అందుకుంటున్న గ్రామీణ మహిళలను చూపిస్తున్న వాణిజ్య ప్రకటనలు బీజేపీ ప్రచార వ్యూహాలలో అగ్రస్థానంలో ఉండటం రెడ్ సిలిండర్ల రాజకీయ ప్రాధాన్యాన్ని మరింతగా విశదం చేస్తోంది. అయితే సగటు భారతీయ కుటుంబ శ్రేయస్సుకు దోహదం చేస్తోన్న ఎల్పీజీ సిలిండర్ల సరఫరా ఇప్పుడు ప్రపంచ భౌగోళిక రాజకీయాల సుడిలో చిక్కుకుంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం, పర్యవసానంగా హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించడంతో, లక్షలాది సామాన్య కుటుంబాల వంటశాలలకూ ఆ యుద్ధతాకిడి చేరింది. భారత్‌కు దిగుమతి అయ్యే ఎల్పీజీలో అత్యధిక భాగం హోర్ముజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతుంది. ఇరాన్ పాలకులు భారత్ దిగుమతులకు ప్రత్యేక అనుమతినిచ్చినప్పటికీ సమస్య తీవ్రత సత్వరం తగ్గిపోయేది కాదు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల అమెరికా, యూరోపియన్ దేశాలలో పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల, వినియోగదారుల ఆగ్రహావేశాలకు ప్రపంచ మీడియా తీవ్ర ప్రాధాన్యం ఇస్తోంది. కానీ, అభివృద్ధి చెందుతున్న దేశాలపై, మరీ ముఖ్యంగా ఆ దేశాలలోని పేదల బతుకుదెరువుల పైన పడుతున్న యుద్ధ విషమ ప్రభావాల గురించి పట్టించుకోకపోవడం పూర్తిగా గర్హనీయం.ఘన ఇంధనాలను-- వంటచెరకు వాటికొక ఉదాహరణ-- మండించడం వాయు కాలుష్యానికి దారితీస్తుంది, దీని ప్రభావం ప్రజల, ముఖ్యంగా పేదల ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుంది. వంట కార్యకలాపాలలో ఉపయోగించే ఘన ఇంధనాల ప్రభావానికి సంబంధించి నాలుగు పరస్పర ప్రభావమున్న అంశాలు ఉన్నాయి. అవి: వర్గం, కులం, జెండర్, గ్రామీణ-- పట్టణ అంతరాలు. ఈ ఇంధనాల ఉపయోగం పేదల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఆర్థిక స్థితిగతులు కాస్త మెరుగ్గా ఉన్న కుటుంబాలపై కూడా దీని ప్రభావం ఉన్నా, పేదలపై ఉన్నంతగా ఉండదు. ఇందుకొక కారణం జనాభా సాంద్రత. గృహ సముదాయాలు కిక్కిరిసి ఉన్న ప్రాతాలలో పేదలు నివసిస్తుంటారు. వారు ఉండే గృహాలు ఇరుకుగా ఉంటాయి. పొయ్యి నుంచి లేచే పొగ ఇల్లంతా వ్యాపించడం పరిపాటి. నిర్దిష్ట గృహంలోనివారే కాకుండా ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఇతరులు కూడా ఆ కాలుష్యం బారిన పడతారు. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ‌దితర పరిశుభ్ర ఇంధనాలు అందుబాటులో ఉండడమనేది కులంపై ఆధారపడి ఉన్నదని కూడా ప్రభుత్వ ?గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండిటిలోనూ ఎల్పీజీని ప్రధాన వంటగ్యాస్‌గా ఉపయోగించుకుంటున్న అగ్రకులాల కుటుంబాల శాతం, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తరగతులకు చెందిన కుటుంబాల శాతం కంటే మూడు లేదా నాలుగు రెట్లు అధికంగా ఉన్నది. ఆయా వర్గాల నివాసస్థలాలు కూడా ఆ వ్యత్యాసానికి కారణమవుతు న్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సామాజికంగా అట్టడుగువర్గాల వారు సాధారణంగా ఊరికి దూరంగా నివాసముంటారు. ఆ ప్రదేశాలకు రవాణా సదుపాయాలు అంతగా ఉండవు. ఎల్పీజీ సిలిండర్లకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా, వాటి రవాణాకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కారణంగా పట్టణ ప్రాంతాలలోని పేదల కంటే గ్రామీణ ప్రాంతాల పేదలు ఆధునిక ఇంధనాలపై కాకుండా సంప్రదాయ ఇంధనాలపైనే ఆధారపడడం తప్పనిసరి అవుతోంది. వంటగ్యాస్‌ను నిరుపేదలకూ అందుబాటులోకి తీసుకురావడంలో ?సరైన గుర్తింపు పొందలేకపోతున్న సంక్లిష్ట సమస్య ఇది. సంప్రదాయక ఇంధనాల (వంట చెరకు, పిడకలు, పంట అవశేషాలు మొదలైనవి)తో వంట చేసుకునే కుటుంబాలలో పొగ కాలుష్యానికి బాధితులు అవుతున్నది మహిళలు, బాలికలే. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాలకుటుంబాలలో ఒకే విధంగా ఉంటోంది. ఆహారాన్ని తయారు చేసే బాధ్యత పూర్తిగా మహిళలది కావడమే ఇందుకు కారణం. కాగా వంటకు ఏ విధమైన ఇంధనాలను ఉపయోగించాలనే నిర్ణయం తీసుకోవడం సాధారణంగా పురుషుల బాధ్యతగా ఉంటోంది. మన సమాజంలో సర్వ సాధారణంగా ఉన్న జెండర్ అసమానతల దృష్ట్యా కుటుంబ బడ్జెట్‌లో మహిళా ఆరోగ్యానికి కేటాయింపులకు సరైన ప్రాధాన్యం లభించడం అరుదు. కుమార్తెలు బాల్యం నుంచే ఇంటి పనులు, ముఖ్యంగా వంట పనుల్లో తల్లికి సహాయపడుతుంటారు. ఈ కారణంగా వారు చిన్న వయసు నుంచే వంటగదిలో పొగ కాలుష్యానికి గురవుతారు. వారిలో చాలామంది జీవితాలు ఆ తరువాత కూడా అటువంటి పరిస్థితులలోనే కొనసాగుతాయి.

# కుప్పకూలిన బంగారు గని..



**జకార్త:** ఇండోనేసియాలోని వెస్ట్ సుమత్రా ప్రావిన్స్‌లో బంగారు గని శుక్రవారం కుప్పకూలింది. ఈ ఘటనలో 15 మంది సజీవ సమాధి అయ్యారు. తప్పిపోయిన మరో ఏడుగురి ఆచూకీ కోసం అధికారులు గాలిస్తున్నారు. ఇండోనేసియాలో అక్రమ మైనింగ్‌లు నిర్వహించడం పరిపాటిగా మారింది. రక్షణ చర్యలు లేకుండానే డబ్బు ఆశ చూపి అక్రమార్కులు పనులు చేయించుకుంటున్నారు. దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో పెట్టిన దీపంలా మారాయి. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి చేరుకోవడం కూడా అధికారులకు పెద్ద పనిగా మారింది.అయితే భారీ వర్షాలవల్లే ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. గురువారం సాయంత్రం నుంచి ఇండోనేసియాలోని చాలా ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. వర్షం ధాటికి సోలోక్ జిల్లాలోని అక్రమ గని కూలిపోయిందని ప్రావిన్షియల్ డిజాస్టర్ ఏజెన్సీ హెడ్ ఇర్వాన్ ఎఫెండి తెలిపారు. గనిలో చిక్కుకుపోయిన మృతదేహాలు, క్షతగాత్రులను బయటకి తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.ఘటనా స్థలానికి చేరుకోవడానికే 8 గంటలపాటు ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుందని అధికారుల బృందంలోని ఓ సభ్యుడు తెలిపారు. ఈ లోపు క్షతగాత్రుల పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. తమ కుటుంబ సభ్యులు కనిపించట్లేదని ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగినప్పుడు గనిలో 25 మంది వరకు ఉన్నారని.. 15 మంది మరణించారని, ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. ఏడుగురు ఆచూకీ లభించట్లేదని అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు.

# అమెరికాలో హిందూ ఆలయంపై దాడి



కాలిఫోర్నియాలోని ఒక హిందూ ఆలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. శాక్రమెంటోలోని బాప్స్ శ్రీ స్వామినారాయణ్ మందిరంపై "హిందువులు వెళ్లిపోవాలి" అంటూ నినాదాలు రాసి అక్కడ విధ్వంసం సృష్టించినట్లు ఆసంస్థ తెలిపింది. పది రోజుల వ్యవధిలోనే హిందువులకు వ్యతిరేకంగా ఇలాంటి దాడులు జరగడం ఇది రెండోసారి అని బాప్స్ ప్రజా వ్యవహారాల విభాగం పేర్కొంది. ఈ నెల 17న న్యూయార్క్‌లోని స్వామి నారాయణ్ మందిర్ వద్ద కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. ఈ ఘటనను తమ సంస్థ తీవ్రంగా ఖండిస్తోందని బాప్స్ పేర్కొంది. ఇలాంటి విద్వేషపూరితమైన నేరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగంతో కలిసి పనిచేస్తామని తెలిపింది. తాజాగా కాలిఫోర్నియాలో జరిగిన దాడిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఆ నాలుగు విషయాలను భార్య దగ్గర దాచాల్సిందే లేదంటే జీవితం నరకం



సాధారణంగా భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉంటే జీవితం నరకప్రాయమవుతుందని చెబుతుంటారు. సంసారం సాఫీగా సాగాలంటే అన్ని విషయాలను ఒకరికొకరు పంచుకోవాలని అంటుంటారు. కానీ అచార్య చాణిక్యుడు మాత్రం మగవాడు తన జీవితం నరకం కాకూడదంటే భార్య దగ్గర ఓ నాలుగు విషయాలను రహస్యంగా ఉంచాలని తెలిపాడు. పొరపాటున కూడా ఆ నాలుగు విషయాలను భార్యకు చెప్పకూడదని తన నీతిశాస్త్రంలో పేర్కొన్నాడు. చాణిక్యుడు భార్య దగ్గర గోప్యంగా ఉంచాలన్న నాలుగు విషయాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

**తన బలహీనత**

మగవాళ్లు తమ బలహీనతను ఎప్పుడూ భార్యలకు తెలియకుండా దాచుకోవాలని ఆచార్య చాణిక్యుడు చెప్పారు. భర్త బలహీనతలు తెలిస్తే భార్య వాటిని ఉపయోగించుకుని తనకు కావాల్సిన పనులు చేయించుకుంటుందని, నలుగురిలో మిమ్మల్ని మీరుగా ఉండకుండా చేస్తుందని పేర్కొన్నారు. దాంతో మగవాళ్లు ప్రజా జీవితంలో ఇబ్బంది పడుతారని తెలిపారు.

**తన సంపాదన**

భర్త తన బలహీనతతోపాటు భార్య దగ్గర దాచి ఉంచాల్సిన మరో విషయం సంపాదన అని చాణిక్యుడు పేర్కొన్నారు. భర్త తన పూర్తి సంపాదన గురించి భార్యకు చెబితే.. అందులోని ప్రతి పైసాకు లెక్కలు అడుగుతుందని, అవసరమైన ఖర్చులకు కూడా అడ్డు తగులుతుందని తెలిపారు. దాంతో చిన్న ఖర్చు కూడా భార్యకు తెలిసి గొడవకు దిగుతుందని, ఇది సంసారాన్ని దెబ్బతీస్తుందని చెప్పారు.

**చేసిన దానం**

భార్య దగ్గర భర్త దాచి ఉంచాల్సిన మూడో విషయం తాను చేసిన దానం గురించి. చేసిన దానం గురించి భార్యకు చెబితే ఆ దానం ఎందుకు చేశావని గొడవపడవచ్చునని, దాంతో చేసిన దానం వ్యర్థమవుతుందని చాణిక్యుడు చెప్పారు. అలాంటి దానంతో పుణ్యం దక్కదని అన్నారు.

**జరిగిన అవమానం**

భర్త తన భార్య దగ్గర గోప్యంగా ఉంచాల్సిన మరో విషయం జరిగిన అవమానమని అచార్య చాణిక్యుడు తెలిపాడు. భర్తకు జరిగిన అవమానం ఏ భార్య కూడా సహించదు. దాంతో భర్తకు జరిగిన అవమానం గురించి తలుచుకుని బాధపడుతుందని, ఇంట్లోని ఇతరులకు చెప్పుకుని ఆవేదన చెందుతుందని, దాంతో ఇంట్లోని వారందరూ బాధపడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు.

# అక్టోబర్ 3 నుంచి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు



దసరా నవరాత్రులకు ఇంద్రకీలాద్రి ముస్తాబవుతున్నది. కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అక్టోబర్ 3న ఘట స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే నెల 12న విజయదశమి వేడుకతో ముగుస్తాయి. అదే రోజు సాయంత్రం కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుగనుంది. శరన్నవరాత్రులు దుర్గాదేవి అవతారాలను శక్తి, జ్ఞానానికి సంబంధించిన దేవతగా పూజిస్తారు. ముల్లోకాలకు మూలపుటమ్మ దుర్గమ్మను ఆశ్వయుజ మాసంలో వచ్చే శరన్నవరాత్రులలో దర్శిస్తే ఐహిక సుఖాలతో పాటు మోక్షాన్ని కూడా పొందవచ్చునని భక్తులు విశ్వసిస్తారు. ఇక దసరా నవరాత్రుల్లో అమ్మవారు ఏ రోజు ఏ అలంకారంలో దర్శనమిస్తారో తెలుసుకుందాం..

**అమ్మవారి అలంకారాలు..**

అక్టోబర్ 3- బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారం
అక్టోబర్ 4- గాయత్రీ దేవి అలంకారం
అక్టోబర్ 5- అన్నపూర్ణా దేవి అలంకారం
అక్టోబర్ 6- లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారం
అక్టోబర్ 7- మహా చండీ దేవి అలంకారం
అక్టోబర్ 8- మహాలక్ష్మీ దేవి అలంకారం
అక్టోబర్ 9- సరస్వతీ దేవి అలంకారం (మూల నక్షత్రం)
అక్టోబర్ 10- దుర్గా దేవి అలంకారం (దుర్గాష్టమి )
అక్టోబర్ 11- మహిషాసుర మర్దిని దేవి అలంకారం (మహర్నవమి)
అక్టోబర్ 12- ఉదయం మహిషాసుర మర్దిని దేవిగా, సాయంత్రం రాజరాజేశ్వరి దేవిగా అలంకారం (విజయదశమి)

# సైబర్ మోసాలకు అడ్డుకట్ట...
# ప్రజల భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- పండగల వేళ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- పిల్లల భద్రతపై తల్లిదండ్రులకు సూచనలు
- బెల్ట్ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు



**దేవనకొండ, మార్చి 17 (స్ఫూర్తి పత్రిక):** సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవనకొండ సీఐ వేణుగోపాల్ సూచించారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మండలంలో అవగాహన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.పండగల సమయం కావడంతో ఆన్‌లైన్ మోసాలు, ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాలపై ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, లింకులు, సందేశాలను నమ్మి బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్ లేదా లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఎక్కువగా ఇంటి బయట గడిపే అవకాశం ఉండటంతో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. చెరువులు, కాలువలు, నీటి కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారు ఎక్కడికి వెళు_న్నారు, ఎవరితో తిరుగుతున్నారు అనే విషయాలను గమనించాలని సూచించారు.వేసవి కాలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గడ్డివాములు, పొడి గడ్డి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో ఎలక్ట్రిక్ వైర్ల కారణంగా మంటలు చెలరేగే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గడ్డివాములపై కవర్లు వేసి, కరెంట్ వైర్లకు దూరంగా ఉంచాలని తెలిపారు.గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరిగితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బెల్ట్ మద్యం విక్రయాలపై సమాచారం అందించిన వారికి గోప్యత కల్పిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే నేరాలను నియంత్రించవచ్చని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

# తక్కువ ఖర్చుతోనే లక్షద్వీప్
# టూర్ ప్యాకేజీలు మిస్ చేసుకోకండి



ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన ఉష్ణమండల ద్వీప వ్యవస్థలలో లక్షద్వీప్ ఒకటి. కేరళ తీరానికి 220-440 కిలో మీటర్ల దూరంలో ఇది ఉంది. ఈ ద్వీపాలు విలువైన పర్యావరణ, సాంస్కృతిక వారసత్వాన్ని భావి తరాలకు అందిస్తున్నాయి. ఈ ద్వీపాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది పగడపు దిబ్బ. ఇది ఒక సహజమైన విశ్రాంతి ప్రదేశం. ఈ లక్షద్వీప్ 36 ద్వీపాల సమూహం. ఈ లక్షద్వీప్ నీటి అడుగున దృశ్యాలు రంగురంగులుగా ఊపిరిబిగపట్టి చూడాల్సినంత సుందరంగా ఉంటాయి. లక్షద్వీప్ సరస్సు ఈత కొట్టడానికి, విండ్-సర్ఫింగ్, డైవింగ్, స్నార్కెలింగ్, కయాకింగ్ లాంటి నీటి క్రీడలకు అనువుగా ఉంటుంది.

ఇక్కడ ప్రతి ద్వీపంపైన మంచు తెల్లని పగడపు ఇసుకతో కప్పి ఉంటుంది. తేట తెల్లని నీరు, రకరకాల సముద్ర జీవులు ఈ ద్వీపాల అందాన్ని ఇనుమడింపజేస్తుంటాయి. ఈ ద్వీపాలు ప్రధాన భూభాగానికి అనుసంధానమై, పర్యాటకుల కోసం ఇక్కడ ఓడ, హెలికాప్టర్, ఎయిర్‌లైన్స్, మెకనైజ్డ్ సెయిలింగ్ లాంటి సదుపాయాలను కలిగి ఉన్నాయి. ఈ లక్షద్వీప్‌ను సందర్శించాలనుకునే వారికి రకరకాల ప్యాకేజీలు ఉన్నాయి. ఆ ప్యాకేజీల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**1. లక్షద్వీప్ సముద్రం**

లక్షద్వీప్ సముద్రం అనేది ఐదు రోజుల సముద్ర యాత్ర. %వీ.ఎ% కవరత్తి ఓడలో కవరత్తి, కల్పేని, మినీకాయ్ దీవులను సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీ కింద ఐదు రోజుల దీవుల పర్యటన పగటిపూట ఉంటుంది. మధ్యాహ్నం లంచ్ అందిస్తారు. రాత్రి వేళల్లో ఓడలోనే బస చేస్తారు. %వీ.ఎ% కవరత్తిలో 150 డైమండ్ క్లాస్ వసతి ఉంది. పగటిపూట యాత్ర సందర్భంగా ఈత, స్నార్కెలింగ్ ఇతర వాటర్ స్పోర్ట్స్‌ను సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. ఏడాది నుంచి 10 ఏళ్ల వయసు వరకుగల పర్యాటకులను చిన్న పిల్లలుగా పరిగణిస్తారు.

చార్జీలు (డైమండ్ క్లాస్)
పెద్దలకు %-% రూ.37500 ం 5 శాతం జీఎస్టీ
పిల్లలకు %-% రూ.33000 ం 5 శాతం జీఎస్టీ
చార్జీలు (గోల్డ్ క్లాస్)
పెద్దలకు %-% రూ.28500 ం 5 శాతం జీఎస్టీ
పిల్లలకు %-% రూ.22500 ం 5 శాతం జీఎస్టీ
నోట్: డిసెంబర్ నెలలో 10 శాతం పెంపు వర్తిస్తుంది.

**2. స్వేయింగ్ పామ్ ప్యాకేజీ**

ఈ స్వేయింగ్ పామ్ ప్యాకేజీ అనేది మినికాయ్ దీవికి ఆరు నుంచి ఏడు రోజుల టూర్. పర్యాటకుల కోసం ప్రత్యేకమైన %రూ/ఎ% కాటేజీలతోపాటు బీచ్‌ల ముందు నిర్మించిన ఇతర వ్యక్తిగత కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. %వీ.ఎ% అరేబియన్ సముద్రం, %వీ.ఎ% లక్షద్వీప్ సముద్రం, కవరత్తి ఓడలలో ప్రయాణం సాగుతుంది.

**3. మెరైన్ వెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్**

మెరైన్ వెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ 4 నుంచి 7 రోజుల ప్యాకేజీ. కద్మత్ వరకు ఈ టూర్ ఉంటుంది. సముద్ర జీవుల ఔన్నత్యాన్ని, అందాలను ఆస్వాదించడానికి ఈ ప్యాకేజీ బాగుంటుంది. ఈ ప్యాకేజీలో ప్రతి పర్యాటకుడు దీవిపై 2 నుంచి 5 రోజులు సరదాగా గడపవచ్చు. వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్విమ్మింగ్, స్నార్కెలింగ్, కయాకింగ్ లాంటి ఆటలను ఎంజాయ్ చేయవచ్చు. కద్మత్‌లో పూర్తిస్థాయి వాటర్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. సాహసం చేయగలిగిన వారు స్కూబా డైవింగ్, విండ్ సర్ఫింగ్, పారా సెయిలింగ్ లాంటి ఆటల్లో మునిగితేలవచ్చు.సూపర్ డీలక్స్ ఏసీ రూమ్‌కు ఇద్దరికైతే రూ.11 వేలు, ఒక్కరికైతే రూ.8 వేలు. అదనంగా ప్రతి మనిషికి రూ.5 వేలు. డీలక్స్ ఏసీ రూమ్‌కు ఇద్దరికి రూ.9 వేలు, ఒక్కరికి రూ.6 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.4 వేలు. ఏసీ స్టాండర్డ్ రూమ్‌కు ఇద్దరికి రూ.7 వేలు, ఒక్కరికి రూ.5 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.3500. నాన్ ఏసీ రూమ్‌కు ఇద్దరికి రూ.5 వేలు, ఒక్కరికి రూ.3 వేలు, అదనంగా ప్రతి మనిషికి రూ.2500. డిసెంబర్‌లో 10 శాతం పెంపు వర్తిస్తుంది.

**4. తారాతాషి ప్యాకేజీ**

తారాతాషి ప్యాకేజీ కవరత్తి దీవి సందర్శనకు సంబంధించినది. కవరత్తి లక్షద్వీప్ పరిపాలనా రాజధాని. ప్యాకేజీలో భాగంగా దీవిలో నాలుగు నుంచి ఐదు రోజుల బస ఉంటుంది. అద్దపు అడుగు కలిగిన బోటులో స్విమ్మింగ్, స్నార్కెలింగ్, స్కూబా డైవింగ్ చేయవచ్చు. ప్యాకేజీలో భాగంగా ఇతర వాటర్ స్పోర్ట్స్‌ను కూడా ఆఫర్ చేస్తున్నారు. ఈ టూర్‌తో మీ హాలీడేస్ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఈ ద్వీపంలో బీచ్ ముందుగల పర్యాటకుల గుడిసెల్లో బస ఉంటుంది.

సూట్ రూమ్‌కు ఇద్దరైనా ఒక్కరైనా కనీసం రూ.11 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.4 వేలు.

**5. తిన్నకరలో టెంట్‌లు**

ఈ ప్యాకేజీ మీరు మీ సొంత దీవుల్లో ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. తిన్నకర దీవి బంగారం దీవికి ఎదురుగా ఉంటుంది. విస్తారమైన సరస్సు తీరంతోపాటు పగడపు ఒడ్డును కలిగి ఉండటం ఈ దీవి ప్రత్యేకత. ఈ తిన్నకర అనేది అగట్టి నుంచి ఈశాన్యంగా 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక చిన్న కన్నీటి చుక్క ఆకారపు దీవి. ఈ దీవిలోని పనోరమా ఆవరణ, అద్భుతమైన సరస్సులు, సిల్వాన్ సముద్ర తీరాలు, ఎండలో తడిసిన ఇసుక, అద్భుతమైన సముద్ర వృక్షజాలం, జంతుజాలం మిమ్ములను మంత్రముగ్ధులను చేస్తుంది. కయాక్స్, గ్లాస్ బాటమ్డ్ బోట్స్ లాంటి వాటర్ స్పోర్ట్స్ క్రాఫ్ట్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మీరు బీచ్ వాలీబాల్ ఆడవచ్చు, సన్ బాత్ చేయవచ్చు.

గుడారాలకు అద్దె ఇద్దరికి రూ.10 వేలు, ఒక్కరికి రూ.8 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.4 వేలు.


**6. బంగారం దీవిలో కాటేజీలు**

ఈ బంగారం దీవి 120 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ దీవిలో జనావాసాలు లేవు. ఈ దీని పగడపు దిబ్బలచే ఆవరింపబడిన సరస్సుతో చుట్టుముట్టబడి ఉంటుంది. ఇది ప్రపంచంలోని ఉత్తమ విహార ప్రదేశంగా గుర్తింపు పొందింది. బంగారం దీవి నిండా ఉన్న కొబ్బరి తోటల్లో అందమైన చేపలు, పందికొక్కులు, చిలుకలు, పఫర్ ఫిష్‌లు, సన్యాసి పీతలు, సముద్ర పక్షులు కనువిందు చేస్తాయి. స్కూబా డైవింగ్, బీచ్ గేమ్స్, స్విమ్మింగ్, స్నార్కెలింగ్, డీప్ సీ ఫిషింగ్ వంటి అనేక సాహసాలు చేసే సౌకర్యం ఉంది. రిసార్ట్‌లో 60 పడకల బీచ్ కాటేజీలు (నాన్ ఏసీ), అనేక వంటకాలను అందించే బహుళ-వంటకాల రెస్టారెంట్ ఉన్నాయి. విమానాశ్రయం ఉన్న అగట్టి నుంచి బంగారం దీవికి చేరుకోవచ్చు.చార్జీలుజి కాటేజీల చార్జీ ఒక్కరైనా ఇద్దరైనా కనీసం రూ.18 వేలు, అదనంగా ప్రతి వ్యక్తికి రూ.8500.

**7. స్కూబా డైవ్ ప్యాకేజీ**

ఈ ప్యాకేజీలో భాగంగా అన్ని డైవింగ్ పరికరాలను అందిస్తారు. స్విమ్మింగ్ స్కిల్స్, డైవింగ్‌కు అభ్యర్థి ఫిట్‌గా ఉన్నట్లు తెలిపే డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి. డైవింగ్ కోర్సులో పాల్గొనడానికి కనీస వయస్సు 14 సంవత్సరాలు ఉండాలి.

# వర్సిటీకి పాల్కుర్కి పేరు సముచితం



తెలుగు భాషా సంస్కృతులకు, చరిత్రకు 'తెలంగాణ' తొట్ట తొలుత వికాస కేంద్రంగా నిలిచింది. ఆ తర్వాతే మిగతా తెలుగు నేలకు సంస్కృతీ వికాసం విస్తరించింది. అలాంటి బంగారు నేలపై వెయ్యేండ్లకు పైగా చారిత్రక సాక్ష్యంగా నిలిచిన భాగ్యనగరం నేడు తెలుగు వారలకు వికాసభూమి, నివాస భూమి, వ్యాపారకేంద్రం, విద్యల నిలయంగా నిలిచింది.తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం.ఈ హైదరాబాద్ మహానగరంలోని విద్యా వికాసానికి కేంద్ర స్థానాలైన విశ్వ విద్యాలయాల్లో తెలుగు విశ్వ విద్యాలయం ఒకటి. నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానసపుత్రికగా, ఆయన హయాంలో అన్ని కళా కేంద్రాలను అంతర్గర్భీకరించుకొని నగరం నడి బొడ్డున అందరికీ అందుబాటులో నాంపల్లి కేంద్రంగా డిసెంబర్, 2 1985లో తెలుగు విశ్వవిద్యాలయం వికసించింది. దీన్ని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో 1998లో 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'గా పేరు మార్చినారు. సంస్కృతం, జ్యోతిషం, క్లాసికల్ తెలుగు, నృత్యం, సంగీతం, చరిత్ర, ఇతర కళలు ఇలా అనేక సంస్కృతీ విభాగాలకు విద్యార్జన కేంద్రమైంది.ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయి పదేండ్లు గడిచిన కారణంగా అన్ని అంశాల్లో విభజన అయి, ఈ విశ్వవిద్యాలయం కూడా ద్విధావిభక్తం అవుతోంది. తెలంగాణ విభాగానికి అనగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి నామీకరణం, నామీకరణం దిశగా ప్రయాణిస్తున్నది. సురవరం ప్రతాపరెడ్డి పేరును ఇదివరలో కొందరు సూచించారు.అయితే, ఇవి ఆధునిక విద్యా విషయాల విశ్వవిద్యాలయాలు కావు. ప్రాచీన సాహిత్యం, సంస్కృతీ, కళల నిలయాలు. వీటికి ప్రాచీనుల పేర్లు తగినవిగా ఉంటాయి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి), వేమన విశ్వ విద్యాలయం (కడప), తిక్కన విశ్వవిద్యాలయం (నెల్లూరు) వంటి పేర్లతో ఆంధ్రులు వాటిని సముచితంగా గౌరవించుకున్నారు. తెలంగాణలోని ఈ విశ్వవిద్యాలయానికి ప్రాచీన తెలుగు కవులు లేరా? పేర్లు దొరకవా? ఆధునిక తెలంగాణ వైతాళికుల పేర్లు పెట్టాలా? అనేది ప్రశ్న.బాగా ఆలోచిస్తే తెలంగాణకు ప్రాచీన సాహిత్య మణి కిరీటంలోని శిరోమణి వంటి పాల్కుర్కి సోమనాథుడున్నాడు. ఇతడు తెలంగాణకే కాదు, తెలుగు సాహిత్యానికే 'స్వతంత్ర తొలి తెలుగు కవి.' ఈతని శిష్ట సాహిత్యం, పద సాహిత్యం, శతక సాహిత్యం, స్తుతి సాహిత్యం పండితులకు పామరులకు ఉపాదేయమైంది. మిగిలిన కవులెలా ఉన్నా, ఈయన పేరు తెలియని తెలుగు వాడుండరు. ప్రసిద్ధుడైన ఈ మహాకవి తెలుగు సాహిత్య లోకానికే స్ఫూర్తిదాత. తెలంగాణ జాతికి నిత్యః ప్రాతః స్మరణీయుడు. అంతేకాదు, అత్యంత ప్రాచీనుడు. ఈయన కాలం 11వ శ. అంతం. ఇంత ప్రాచీనుడైన ప్రతిభావంతుడైన మహాకవి మరొకరు లేడు.తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం. అందరికీ సమ్మతంగా ఉండే భేషైనా కీర్తిమంతమైన చర్య. ముఖ్యమంత్రి, విద్యామంత్రులు ఈ విషయంగా పరిశీలించగలరని మనవి.అయితే, సురవరం ప్రతాపరెడ్డి గారి పేరు సంగతేమిటని ఒక ప్రశ్న తలెత్తుతుంది. వీరు తెలంగాణలోని ఆధునిక సాంస్కృతిక వైతాళికుల్లో ఆద్యగణనీయుడు. ఈయన తెలంగాణలో పుట్టకుంటే, తెలంగాణ సంస్కృతీ, కళావారసత్వం, రాజకీయ వికాసం ఒక వందేండ్ల వెనుకకు ఉండేదంటే అతిశయోక్తి కాదు. మరి అలాంటి మహానుభావుడి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టరాదా అని ప్రశ్న. అయితే, ఒక ప్రాచీన మహాకవి కోసం తపించి, పాల్కుర్కి సోమనను గణనలోకి తీసుకున్నాం.సురవరం ప్రతాపరెడ్డి పేరును ఒక విశ్వవిద్యాలయానికి పెట్టవలసిందే. అంతటి యోగ్యత వారిది. ఆ బాధ్యత మనందరిది. ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయం ఉంది. ఇది కొత్త విశ్వ విద్యాలయాల్లో ఒకటి. పైగా ఈ విశ్వవిద్యాలయం సురవరం వారి సొంత జిల్లాలోనిది. వారు ఆ జిల్లా వాసులే గనుక, వారిపేరు ఆ విశ్వవిద్యాలయానికి పెడితే సముచితంగా ఉంటుంది. 'సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం, లేదా సురవరం ప్రతాపరెడ్డి పాలమూరు విశ్వవిద్యాలయం' అన్నా సముచితంగా ఉంటుంది.అంతేకాదు తెలంగాణ రాష్ట్ర వాసులందరే కాక విశేషించి పాలమూరు జిల్లా స్థానికులు కూడా బాగా హర్షిస్తారు. ప్రతాపరెడ్డి గారంటే అభిమానించే వారు కూడా ఈ నిర్ణయాన్ని గౌరవిస్తారు, ఆహ్వానిస్తారు. సురవరం వారికి గూడా మనం ప్రేమపూర్వకంగా, నివాళి అర్పించినట్టుంటుంది. ఒకరు ప్రాచీన వైతాళికునిగా, మరొకరు ఆధునిక తెలంగాణ వైతాళికునిగా ఉభయులను 'పాల్కుర్కి సోమన, సురవరం ప్రతాపరెడ్డి గారలను' సంభావించి, సముచిత గౌరవమిచ్చి తెలంగాణ జాతికి వారిచ్చిన అమూల్య సంస్కృతీ వారసత్వాన్ని గౌరవించుకున్నట్టుంటుంది.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com